సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



కేసీఆర్ అసమర్థతతోనే..

మాజీ సీఎం కేసీఆర్ అసమర్థ విధానాల వల్లే రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నా యని మంత్రి తుమ్మల ఆరోపించారు. 10లో



కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్

యాసంగి సీజన్‌లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదవుతాయి. గంటగం టకూ ఎండ పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.27

సహర్ (గురువారం ఉ॥) 4.39

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళ వారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళ వారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రేపు వేంకటేశ్వరస్వామి కల్యాణం



ర్యాలీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ : పట్టణంలోని శ్రీనివాస గిరి గుట్టపై గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణచార్యులు తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ.. కల్యాణాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు వస్తారని, ఈ మేరకు ఏర్పాట్లు సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఆరుట్ల ఫణిరాజు ఆచార్యులు, కమిటీ సభ్యులు కంతాల వెంకటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, ధర్మపురి రాము, కందుకూరి రామకృష్ణ, సేవాదళ్ సభ్యులు రాంజీ, అంబేద్కర్ పాల్గొన్నారు.

సైబర్ వారియర్లకు సెల్‌ఫోన్లు..



వారియర్లకు ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక శిక్షణ పొందిన జిల్లాలోని 28 మంది సైబర్ వారియర్లకు ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళ వారం తన కార్యాలయంలో సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు ఒక సైబర్ వారియర్‌ను నియమించినట్లు తెలిపారు. సైబర్ నేరాల బారిన పడిన వారు 1930 నంబర్‌కు ఫోన్ ద్వారా లేదంటే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేస్తేనే నేరస్తులను గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ వారియర్ల ద్వారా తమ అప్లికేషన్ల స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌చార్జ్ జితేందర్, సైబర్ సెల్ సభ్యుడు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్సెస్సీ మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబపత్రాల మూల్యాంకనం బుధవారం నుంచి మొదలుకానుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,10,480 జవాబుపత్రాలు ఖమ్మం చేరుకోగా, జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఈనెల 12వ తేదీ వరకు మూల్యాంకనం చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగే క్యాంపులో ఒక్కో ఉపాధ్యాయుడు గరిష్టంగా 40జవాబుపత్రాలు దిద్దాల్సి ఉంటుంది.

అథారిటీ అమలెప్పుడో..?

ప్రస్తుత ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. కనీసం ఇప్పుడైనా పట్టణ అభివృద్ధి కోసం తూతూ మంత్రంగా ప్రతిపాదనలు కాకుండా క్షేత్ర స్థాయిలో సమస్యలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళిక రూపొందించాలి. ఇందుకోసం అవసరమైతే చట్టబద్ధంగా ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలి.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

భద్రాచలం అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- సాధారణ ప్రతిపాదనలతో ఫలితాలు అంతంతే
- అభివృద్ధి కోసం ప్రత్యేక అథారిటీ అవసరం



భద్రాచలం పట్టణం వ్యూ

సమన్వయంతోనే సాధ్యం..

గత ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామంటూ ఏళ్ల తరబడి ప్రకటనలు చేసిందే తప్ప రూపాయి కూడా మంజూరు చేయలేదు. వరదల సందర్భంగా రూ.1,000 కోట్లు ప్రకటించినా అవీ ఒక్క రూపాయి విడుదల కాలేదు. అయితే ఆ స్థాయిలో నిధులు మంజూరైనప్పటికీ భద్రాచలంలో పనులు చేపట్టడం అంత తేలికైన అంశం కాదు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం పట్టణంలో స్థల సమస్య ఏర్పడడంతో అభివృద్ధి జఠిలంగా మారింది. పట్టణంలో కీలకమైన దేవాదాయ, పంచాయతీరాజ్, రెవెన్యూ, అటవీశాఖ, ఐటీడీఏ, పోలీస్, పర్యాటక విభాగాల మధ్య సమన్వయం అవసరం. లేదంటే తేనెతుట్టెను కదిల్చినట్టే. ఒక విభాగం పనులు మొదలెడితే మరో విభాగం అడ్డుకునే పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం నెలకొంది. అందువల్ల అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేస్తే తప్ప అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కాదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

చిక్కుముడులెన్నో..

భద్రాచలం గ్రామ పంచాయతీ ఆదాయం అంతంత మాత్రమే. ఈ మేజర్ పంచాయతీ వార్షిక ఆదాయం రూ.4 కోట్లు, ఖర్చు సుమారు రూ. 3.50 కోట్లుగా ఉంది. ఇక ఆలయ వార్షిక ఆదాయం సుమారు రూ.40 కోట్లు ఉండగా.. ఖర్చు కూడా అంతే మొత్తంలో ఉంటుంది. ప్రతీ ఏడాది ఘనంగా నిర్వహించే శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి వంటి పండుగల ఏర్పాట్లకే ఈ బడ్జెట్ సరిపోవడం లేదు. ఈ తరుణంలో ఇటు ఆలయం, అటు పట్టణ అభివృద్ధికి పంచాయతీ, దేవాదాయ శాఖలు పైసా కూడా ఖర్చు చేసే పరిస్థితి లేదు. మరోవైపు భద్రాచలం పూర్తిగా ఏజెన్సీ పరిధిలో ఉంది. అటవీ చట్టాలు, 1/70 నిబంధనలు ఉన్నాయి. దీంతో కనీసం భద్రాచలం పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసే అవకాశం కూడా లేకుండా పోయింది.

అథారిటీ ఎందుకంటే..

ఒక ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలంటే సాధారణ పద్ధతులు సరిపోవు. అందుకే ప్రత్యేక అథారిటీలను ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తుంటాయి. ఉదాహరణకు ఖమ్మం నగరాభివృద్ధి కోసం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర రాజధానిలో ఎప్పటి నుంచో హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పని చేస్తోంది. అలాగే టెంపుల్ టౌన్‌గా ఉన్న భద్రాచలం అభివృద్ధి కోసం ఈ తరహా ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భద్రాచలం పట్టణానికి ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఈ తరహా ఏర్పాటు తప్పదని నిపుణులు చెబుతున్నారు. గతంలో టెంపుల్ సిటీ పేరుతో వివిధ ప్రతిపాదనలు తెరపైకి వచ్చినా ఆచరణలో అమలుకు నోచుకోలేదు.

ప్రభుత్వమే చర్యలు చేపట్టాలి



భద్రాచలం పట్టణంతో పాటు రామాలయం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వమే నడుం బిగించాలి. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలి. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. అంతేకాకుండా గిరిజన, గిరిజనేతరులకు ఎలాంటి నష్టం లేకుండా పనులు చేయాలంటే ప్రత్యేక అథారిటీతోనే సాధ్యం.

– గాదె మాధవరెడ్డి, గ్రీన్ భద్రాద్రి సభ్యుడు

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- ఈవీఎంల వినియోగంపై అవగాహన ఉండాలి
- శిక్షణకు హాజరు కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



ఎన్నికల సిబ్బంది శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రియాంక ఆల

పాల్వంచరూరల్ : లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సిబ్బంది వ్యవహరించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల స్థాయిలో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 275 మంది, అశ్వారావుపేటలో 264, ఇల్లెందులో 225, పినపాకలో 260, భద్రాచలం నియోజకవర్గంలో 209 మంది చొప్పున మొత్తం 1,233 మందికి గాను 48 మంది సిబ్బంది గైర్హాజరయ్యారని, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, భూమి, కొలతల శాఖాధికారి కుసుమకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, భద్రాచలం, పాల్వంచ తహసీల్దార్లు శ్రీనివాస్, వివేక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యర్రం చిన్నప్పయ్య పాల్గొన్నారు.

వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు తగు రక్షణ చర్యలు పాటించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంతో పాటు అన్ని మండలాల వైద్యారోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఆస్పత్రుల్లో అత్యవసర మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పనివేళలు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో పాటించాల్సిన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జనసాంద్రత ఉన్న ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వ్యవసాయ కార్మికులు, హమాలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 17న భద్రాచలంలో శ్రీరామనవమికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. ఆశా వర్కర్లకు, ఏఎన్‌ఎంలకు వడదెబ్బ, ప్రథమ చికిత్సపై శిక్షణ ఇవ్వాలని చెప్పారు. డాక్టర్లు 24 గంటలూ అందుబాటులో ఉండాలని, అత్యవసరమైతే తప్ప సెలవులు ఇవ్వొద్దని వైద్యాధికారులను ఆదేశించారు. వడదెబ్బ మరణాల నమోదుకు, విచారణకు మండల వైద్యాధికారి, తహసీల్దార్, ఎస్సైతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రతిరోజు నివేదికలు అందజేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్డీఓ విద్యాచందన, అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్, డీఎంహెచ్‌ఓ శిరీష, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీపీఓ చంద్రమౌళి, వ్యవసాయాధికారి బాబురావు, పశు సంవర్థక శాఖాధికారి పురందర్, డీఈఓ వెంకటేశ్వరాచారి, వైద్యులు మధువన్, బాలాజీ నాయక్, సుకృత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కరువు నెలకొన్న గ్రామాల్లో పంట నష్టం వివరాలు సేకరించాలని, పంటలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ. 500 చెల్లించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్ ప్రియాంక ఆలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, బీఆర్‌ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ మాట్లాడారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని అన్నారు. గ్రామాల వారీగా పంటల నష్టాన్ని అంచనా వేయాలని, వారు ఇచ్చిన నివేదికలను యుద్ధప్రాతిపదికన ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎకరానికి రూ.25వేల నష్ట పరిహారం ఇప్పించేలా చూడాలని కోరారు. వరితోపాటు వివిధ పంటల మద్దతు ధరకు అదనంగా రూ. 500 చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, ఈ ఖరీఫ్ నుంచే బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని విమర్శించారు. యాసంగి పంటలకైనా బోనస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కలెక్టరేట్‌కు వెళ్లడానికి మూడు వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దిండిగాల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, మోరె భాస్కర్, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతేనే బయటకు రావాలి

- వడదెబ్బ తగిలితే 108కు ఫోన్ చేయండి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష

కొత్తగూడెంరూరల్: జిల్లాలో రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష సూచించారు. అత్యవసమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు వెళ్లొద్దని కోరారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వడదెబ్బ నివారణకు తమ శాఖ అందించే సూచనలు పాటించాలన్నారు. వడదెబ్బకు గురైన వారు వెంటనే 108కు ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చి చికిత్స చేస్తారని చెప్పారు. ఎండాకాలంలో సరిపడా ద్రవాలు తీసుకోవాలని, దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలని అన్నారు. రైళ్లు, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు తాగునీరు వెంట తీసుకవెళ్లాలని, ఓఆర్‌ఎస్, నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు, ఇంట్లో తయారు చేసిన పానీయాలను కొద్దిగా ఉప్పు కలిపి సేవించాలని తెలిపారు. లేత రంగులో ఉండే కాటన్ దుస్తులు ధరించాలని, బయటకు వెళ్లేప్పుడు గొడుగు, తలకు టోపీ, టవల్, తలపాగా.. ఏదో ఒకటి ఉపయోగించాలని సూచించారు. చిన్నపిల్లలు, గర్భిణులు, మానసిక వ్యాధిగ్రస్తులు, ఇతర అనారోగ్యంతో ఉన్నవారు చల్లటి వాతావరణంలో ఉండడమే మేలని చెప్పారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

ఉపాధ్యాయులకు ట్రైనీ కలెక్టర్ల సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్లు

దుమ్ముగూడెం : గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్ మర్మట్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రేగుబల్లి, లక్ష్మీనరగంలోని ఈఎంఆర్‌ఎస్ పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై ఐటీడీఏ ద్వారా అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు పౌష్టికాహారం అందించాలని, గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే కృషి చేస్తుండడం హర్షణీయమని, ఇంకా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయొచ్చని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. చదువుతో పాటు వారికి ఇష్టమైన క్రీడల్లోనూ మెళకువలు నేర్పించి అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేలా చూస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు కూడా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో గురుకులం ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, ఏటీడీఓ నరసింహారావు, హెచ్‌ఎం నాగమణి, ఈఎంఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తిలో భేష్..

- దూసుకెళ్తున్న కేటీపీఎస్ ఏడో దశ
- సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో ఉత్పత్తి
- అత్యధిక పీఎల్‌ఎఫ్‌తో దేశంలోనే ద్వితీయ స్థానం



కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం

పాల్వంచ : పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం విద్యుదుత్పత్తిలో తన రికార్డు తానే తిరగరాసుకుంటోంది.రాష్ట్ర విభజన తర్వాత అత్యధిక విద్యుత్ ఉత్పాదక సంస్థగా నిలిచింది. అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటూనే ఉత్పత్తిలో తనదైన ముద్ర వేసుకుంటోంది. ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు ఐక్యత చాటుతూ అత్యధిక ఉత్పత్తి సాధిస్తున్నారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నడుస్తున్న 800 మెగావాట్ల ప్లాంట్లలో గడిచిన ఆర్థిక సంవత్సరం (2023–24)లో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవగా, రాష్ట్ర జెన్‌కో యూనిట్లలో ప్రథమ స్థానం సాధించడం విశేషం.

2018లో జాతికి అంకితం..

పాల్వంచలోని సబ్ క్రిటికల్ టెక్నాలజీ కర్మాగారాలైన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం, 5, 6 దశల కర్మాగారాలకు అనుబంధంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కర్మాగారానికి శ్రీకారం చుట్టారు. 720 మెగావాట్ల ఓఅండ్‌ఎం కర్మాగార యూనిట్ల కాలం చెల్లడంతో వాటి స్థానంలో ఈ నూతన టెక్నాలజీ కర్మాగారానికి అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో 12 యూనిట్‌లో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మించి 2018 డిసెంబర్ 26న జాతికి అంకితం చేశారు. దేశ వ్యాప్తంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు 23 ఉన్నాయి. వీటిలో ఒడిశా రాష్ట్రం దారేపల్లిలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) ప్రథమ స్థానంలో, పాల్వంచ కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం ద్వితీయ స్థానంలో నిలిచాయి. 2020 – 21, 2021 – 22 ఆర్థిక సంవత్సరాల్లోనూ కేటీపీఎస్ కర్మాగారం ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. 2022 – 23లో 80 రోజుల పాటు కాపిటల్ ఓవరాల్ పనులు జరగడంతో ఉత్పత్తి బ్యాక్‌డౌన్‌లో నడిచింది. దీంతో స్వల్ప తేడాతో ద్వితీయ స్థానంలోకి వెళ్లింది. తిరిగి 2023 – 24లో 6011.2766 మిలియన్ యూనిట్లు సాధించింది. గతేడాది పీఎల్‌ఎఫ్ (ఉత్పాదక శక్తి సామర్థ్యం) 60.09 కాగా, ఈసారి 85.54 శాతం సాధించారు. అంతేగాక అతి తక్కువ ఆగ్జలరీ పవర్ కంజంక్షన్(విద్యుదుత్పత్తికి వినియోగించే విద్యుత్)తో పాటు, మోటార్లను స్టార్ట్ చేసేందుకు అతి తక్కువ ఆయిల్‌ను వినియోగించారు. ఏడాది మొత్తంలో ఏడు సార్లు మాత్రమే విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది.

గత మూడేళ్లలో విద్యుదుత్పత్తి ఇలా..(మిలియన్ యూనిట్లలో)

	2021 – 22	2022 – 23	2023 – 24
పీఎల్‌ఎఫ్(శాతం)	72.78	82.10	77.74
ఉత్పత్తి	6,375.243	7,191.68	6,828.334
ఆయిల్(కిలోవాట్లు)	0.545	0.426	0.395
బొగ్గు (మె.టన్నులు)	0.658	0.701	0.700

5, 6 దశల్లో అంతంతగానే..

కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో మాత్రం విద్యుదుత్పత్తి నిరాశజనకంగానే ఉంది. ఐదో దశలో 9,10 యూనిట్లలో 250 మెగావాట్ల చొప్పున, 6వ దశలో 11 యూనిట్ ద్వారా 500 మెగావాట్లు.. మొత్తం 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. కాగా, 2023 – 24లో రెండు యూనిట్లలో కలిపి 6,828.334 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మాత్రమే సాధించారు. పీఎల్‌ఎఫ్ కూడా 77.74 శాతం నమోదైంది. అదే 2022 – 23లో 7,191.68 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి, పీఎల్‌ఎఫ్ 82.10 శాతం వచ్చాయి.

సమష్టి కృషితోనే ఫలితం



కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం విద్యుదుత్పత్తిలో దేశంలో ద్వితీయ స్థానం, జెన్‌కో పరిధిలో మొదటి స్థానం రావడం సంతోషంగా ఉంది. రికార్డు స్థాయిలో పీఎల్‌ఎఫ్ 85.54 శాతం వచ్చింది. ఉన్నతాధికారుల సహకారం, ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగించాలి.

–పి.వెంకటేశ్వరరావు, సీఈ

ఏజెన్సీలో నీటి ఎద్దడి నివారణపై దృష్టి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పీఓ ప్రతీక్‌జైన్, అధికారులు

భద్రాచలం: వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఏజెన్సీ ప్రాంత గిరిజన రైతులకు నీటిఎద్దడి ఎదురు కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఢిల్లీకి చెందిన భారత రూరల్ లెవల్ వుడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం నుంచి పీఓతో పాటు అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత రూరల్ లెవల్ వుడ్స్ ఫౌండేషన్ సీఈఓ మాట్లాడుతూ గిరిజన రైతుల జీవితాల అభివృద్ధి, స్థిరమైన వ్యవసాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గిరిజన గ్రామాల్లో చేస్తున్న పర్యటనలకు ఐటీడీఏ అధికారులు సహకరించాలని చెప్పారు. అనంతరం పీఓ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ భద్రాచలం ఏజెన్సీలో గిరిజన రైతులు వ్యవసాయం చేసుకునేలా ఐటీడీఏ గిరి వికాసం ద్వారా సబ్సిడీపై బోర్లు వేయిస్తున్నామని తెలిపారు.

గిరిజన విద్యాభివృద్ధికి కృషి

ఐటీడీఏ ద్వారా గిరిజన కుటుంబాలు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. భద్రాచలంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్‌తో పాటు యూనిట్ అధికారులతో సమావేశయ్యారు. ఈసందర్భంగా పీఓ ఐటీడీఏ ద్వారా అమలుచేస్తున్న పథకాలను వెల్లడించగా, యూనిట్ అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. ఆతర్వాత గణితం ఉపాధ్యాయులతో సమావేశమైన పీఓ... గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో విద్యార్థుల్లో గణితంపై భయాన్ని తొలగించి సులువుగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈసమావేశాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, వివిధ శాఖల అధికారులు భాస్కరన్, భీము, సురేష్‌బాబు, తానాజీ, విజయ్‌కుమార్, శ్రీనివాస్, రమణయ్య, అశోక్‌కుమార్, మునీర్‌పాషా, వెంకటేశ్వర ప్రసాద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.6.50 లక్షల నగదు సీజ్


నగదు స్వాధీనం చేసుకుంటున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు రూరల్ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.6.50 లక్షల నగదును మణుగూరు సీఐ సతీష్‌కుమార్ మంగళవారం సీజ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో సీఐ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కోట వెంకట అప్పారావు అనే వ్యక్తి రూ.1.50 లక్షలు, ఇట్టే పుల్లారావు రూ.5 లక్షలు తీసుకెళ్తున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా వీరి వద్ద ఉన్న బ్యాగులను సోదా చేయగా.. ఈ మేరకు నగదు లభ్యమైందని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని సీఐ తెలిపారు. ఈ నగదును ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించారు. తనిఖీల్లో ఎస్సై రాజేష్, హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్లు సన్నై, షమీం పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సుజాతనగర్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన సుజాతనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సుజాతనగర్‌కు చెందిన కుమారి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు గత నెల 29న ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని రూ.30 వేల నగదు, 15 గ్రాముల బంగారు మాటీలు, ఉంగరాలు, ఇతర ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం సాయంతో పోలీసులు వివరాలు సేకరించారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

టేకులపల్లి: మండలంలోని మొక్కంపాడుతండా గ్రామానికి చెందిన బానోత్ వినోద (40) వడదెబ్బకు గురై మంగళవారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న వినోద కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటోంది. రెండు రోజులుగా ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురై మృతిచెందింది. ఆమెకు భర్త చంద్రు, కుమారులు సంతోష్, భావ్‌సింగ్ ఉన్నారు.

అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రి సీజ్


ఆస్పత్రిలో విచారిస్తున్న ట్రైనీ ఐపీఎస్ మౌనిక

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆస్పత్రుల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. తాజాగా మంగళవారం పాత డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ఉన్న ఆర్‌జేఆర్ హెర్బల్ ఆస్పత్రిలో డీఎంహెచ్‌ఓ మాలతి ఆధ్వర్యాన తనిఖీ చేశారు. గత ఏడాది ఆగస్టు నుండి అనుమతి లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తుండడం, అర్హత లేని వైద్యులతో చికిత్స చేయిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేశారు. కాగా, అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు తేలడంతో ఇటీవల ఆదర్శ ఆస్పత్రిని సీజ్ చేయగా కేసు నమోదైంది. సదరు ఆస్పత్రిని మంగళవారం ట్రెయినీ ఐపీఎస్ మౌనిక, డీఎంహెచ్‌ఓ మాలతి మరోమారు తనిఖీ చేసి పూర్తి వివరాలతో పోలీసుస్టేషన్‌కు రావాలని సూచించారు. తనిఖీల్లో టూటౌన్ ఎస్సై రఫీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో గొర్రెల మందపై దాడి చేసిన కుక్కలు ఆరు గొర్రెలను హతమార్చాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పచ్చిపాల నాగయ్య చెందిన గొర్రెలు దొడ్డిలో ఉండగా ఉదయం కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుమారు రూ.80వేల విలువైన ఆరు గొర్రెలు మృతిచెందాయి. ఈమేరకు తనకు పరిహారం అందించి ఆదుకోవాలని నాగయ్య కోరాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి ఇల్లు దగ్ధం

సత్తుపల్లిరూరల్: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఓ గడ్డి ఇల్లు దగ్ధమైంది. మండలంలోని కిష్టాపురం తండాలోని ధరావత్ పోతానాయక్‌కు చెందిన గడ్డి ఇంట్లో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. కాగా, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఇన్‌చార్జ్ ఎం.వెంకటేశ్వరరావు, ఏఎల్‌ఎఫ్ వీరభద్రం, డ్రైవర్లు వెంకట్, బాబురావు, ఫైర్‌మెన్ రాజేందర్ పాల్గొన్నారు. అయితే, ఘటనలో రూ.60వేల మేర నష్టం ఎదురైందని బాధితుడు పోతానాయక్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

మొక్కజొన్నల కొనుగోళ్లకు గ్రీన్‌సిగ్నల్


చింతకాని మండలంలో సాగు చేసిన మొక్కజొన్న

మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రాల ఏర్పాట్లు
- రెండు జిల్లాల్లో 46 కేంద్రాల ప్రారంభానికి కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

ఖమ్మంవ్యవసాయం: యాసంగిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట కొనుగోళ్లకు ప్రభుత్వం అంగీకరించింది. పంట కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ ముందుకు రావడంతో ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం రూ.2,090 మద్దతు ధరను ప్రకటించగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.1,900 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం కొనుగోళ్లకు సిద్ధమైంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా.. సాగు ప్రాంతాల ఆధారంగా 46 కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ సిద్ధమవుతోంది. వారం రోజుల్లో గుర్తించిన ప్రాంతాల్లో కొనుగోళ్లు మొదలయ్యే అవకాశముంది.

పత్తి దెబ్బతీయడంతో మొక్కజొన్న..
ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 80 వేల ఎకరాల మేర మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రధానంగా నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఈ పంట వేశారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించక పోవటంతో పత్తి పంట దెబ్బతిని దిగుబడి పడిపోవడంతో రైతులు మొక్కజొన్నపై మొగ్గు చూపారు.


ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చిన మొక్కజొన్న రాశి (ఫైల్)

ఒకటి, రెండు పత్తితీతల తర్వాత తొలగించి మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 64,683 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 15,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కాగా... ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. అయితే, నీటి సమస్య కారణంగా పైర్లు ఎండిపోతుండడంతో... ఉన్న పంటనైనా మద్దతు ధరతో కొనాలని ప్రభుత్వం ముందుకొచ్చింది.

వారంలోగా కేంద్రాలు ప్రారంభిస్తాం..



యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న కొనుగోళ్లకు కసరత్తు ప్రారంభించాం. ఎక్కువగా సాగైన ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదించాం. నాణ్యత ఆధారంగా కేంద్రప్రభుత్వ మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తాం. వారం రోజుల్లో రెండు జిల్లాల్లో కొనుగోళ్లు మొదలవుతాయి.
– సునీత, మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

సాగైన ప్రాంతాల్లో కేంద్రాలు

ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో 46 కేంద్రాల ద్వారా మొక్కజొన్నల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సన్నాహాలు చేస్తోంది. పంట సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం కాగా.. ఖమ్మం జిల్లాలో 30, భద్రాద్రి జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఖమ్మం జిల్లాలో కొణిజర్ల, చింతకాని మండలాల్లోనే దాదాపు 35 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. అలాగే, ముదిగొండ, బోనకల్, ఖమ్మం రూరల్, కూసుమంచి, కల్లూరు, తల్లాడ, రఘునాథపాలెం, వైరా, ఎర్రుపాలెం, మధిర, కూసుమంచి, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో, భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, ముల్కలపల్లి, పాల్వంచ, పినపాక తదితర మండలాల్లో మొక్కజొన్న ఎక్కువగా సాగైంది.

కందకం పనుల అడ్డగింత

అశ్వారావుపేటరూరల్: పోడు భూముల్లో ఎఫ్‌డీసీ(అటవీ అభివృద్ధి కార్పొరేషన్) అధికారులు తవ్విస్తున్న కందకాల పనులను కొందరు పోడు సాగుదారులు, మాస్‌లైన్ పార్టీ నాయకులు కలిసి అడ్డుకున్నారు. దాంతో పోడు సాగుదారులకు, ఎఫ్‌డీసీ సిబ్బందికి మధ్య మంగళవారం వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామ సమీపంలో పోడు సాగు చేస్తున్న కొంతమంది గిరిజన రైతులకు గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోడు హక్కు పత్రాలు అందించింది. కాగా పోడు హక్కు పత్రాలున్న గిరిజనుల భూముల్లో స్థానిక ఎఫ్‌డీసీ అధికారులు రెండు రోజులుగా జేసీబీలతో కందకాలు తవ్విస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోడు రైతులు, స్థానిక సీపీఐ ఎంఎల్–మాస్‌లైన్ జిల్లా నాయకులు కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు ఆధ్వర్యంలో కందకాలు తీస్తున్న ప్రాంతానికి వెళ్లి వారిని నిలదీశారు. సర్వే చేసి, హక్కు పత్రాలు ఇచ్చి ఏడాది కావస్తోందని, ఇప్పుడా భూముల్లో కందకాలు తీయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో ఎఫ్‌డీసీ అధికారులు ఇవి కార్పొరేషన్ భూములని, అక్రమణకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపట్టామని


సిబ్బందితో మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకులు

చెప్పగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి కందకం తీసే పనులను అడ్డుకున్నారు. ఆర్‌ఎఫ్‌ఆర్ సర్వే చేసిన సమయంలో కుడా అభ్యంతరం పెట్టకుండా, హక్కు పత్రాలు ఉన్న భూముల్లో కందకాలు తీస్తే సహించేది లేదని నాయకులు స్పష్టం చేశారు. దీంతో ఎఫ్‌డీసీ అధికారులు కందకాల పనులను తాత్కాలికంగా నిలిపి వేయడంతో వివాదం సద్దుమణిగింది. దీనిపై స్థానిక ఎఫ్‌డీసీ రేంజర్ చంద్రకళ మాట్లాడుతూ.. కార్పొరేషన్, పోడు భూముల మధ్య సరిహద్దుల కోసం కందకాలు తీస్తున్నామని అన్నారు. పోడు సాగుదారులు మళ్లీ సంస్థ భూముల్లోకి రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్ట్‌లో మందు పార్టీ !

ఉన్నతాధికారులకు ఫిర్యాదు

బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల కోసం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌లో సోమవారం రాత్రి మందు పార్టీ జరగడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా కాకుండా చూసేందుకు మోరంపల్లిబంజరలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశారు. అయితే ఈ చెక్‌పోస్ట్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న బూర్గంపాడు ఏఎస్సై, ఇతర సిబ్బంది అక్కడే మందు పార్టీ చేసుకున్న వీడియోలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చెక్‌పోస్ట్‌లో ఏఎస్సై మందు తాగుతున్న దృశ్యాలను సెల్‌లో వీడియో తీస్తున్న మీడియా ప్రతినిధి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కునేందుకు ఆయన యత్నించారు. ఈ ఘటనపై బూర్గంపాడు ఎస్సై సుమన్‌ను వివరణ కోరగా సోషల్ మీడియాలో వచ్చిన వీడియో క్లిప్పింగ్‌ల ఆధారంగా చెక్‌పోస్ట్‌లో మద్యం సేవించిన వారిపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని తెలిపారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

70 లీటర్ల నాటుసారా స్వాధీనం


పట్టుబడిన నాటుసారా, నిందితులు

బూర్గంపాడు: మండలంలోని సారపాకలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి 70 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్ ఆదేశాల మేరకు దాడులు చేపట్టి ఆటోలో తరలిస్తున్న నాటుసారా పట్టుకున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుండువారిగూడెం గ్రామానికి చెందిన మాలోత్ హచ్చి, భూక్యా సక్కు, ఆటోడ్రైవర్ గుగులోత్ రవి, జర్పుల సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ బషీర్ అహ్మద్, కరీమ్, సుధీర్, హరీష్, హనుమంతరావు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: వివాహ వేడుకలో దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్ఐ పి.శివరామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో గత నెల 27వ తేదీన ఓ వివాహ వేడుక జరిగింది. కాగా విందు కార్యక్రమంలో మాంసం కూర విషయంలో గొడవ జరగగా, ఇది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో గాండ్లగూడేనికి చెందిన జర్పుల హరికృష్ణ, అతడి సోదరి దేవిపై ఇదే గ్రామానికి చెందిన వాంకుడోతు రాంబాబు, సుక్రు, రవి, స్వాతి, కల్యాణి, మాలోతు అలీబాబు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై దేవి ఫిర్యాదుతో దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం విక్రేతలపై..
దుమ్ముగూడెం : ప్రభుత్వం ప్రజలకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్ మంగళవారం తెలిపారు. మండలంలోని కాటాయిగూడెం గ్రామానికి చెందిన అజారుద్దీన్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కొనుగోలు చేసిన 3.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అజారుద్దీన్ ములకపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ అలియాస్ బాబి సహాయంతో చింతూరు మండలం చెట్టి గ్రామానికి చెందిన అస్గర్‌కు సరఫరా చేస్తుంటాడని తెలిపారు. అలాగే ఎటపాక మండలానికి చెందిన కట్టా నాగేశ్వరావు, కట్టా కార్తీక్ కొనుగోలు చేసిన 3.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం కూడా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వారందరిపై నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసు నమోదు చేశామన్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకులపై..
దమ్మపేట: అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన బెల్ట్ షాపుపై ఎఫ్‌ఎస్‌టీం, పోలీసులు సంయుక్తంగా దాడి చేసి కేసు నమోదు చేశారు. మండలంలోని నాగుపల్లి గ్రామంలో ఓ బెల్ట్ షాపులో అక్రమంగా మద్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో మంగళవారం ఎఫ్‌ఎస్‌టీం అధికారి కృష్ణ, ఎస్సై సాయికిషోర్‌రెడ్డితో కలిసి దాడి చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన 14 లీటర్ల మద్యం సీసాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.8,700 ఉంటుందని ఎస్సై తెలిపారు.

భూ వివాదంలో..
ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట గ్రామంలో భూ వివాదంలో చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువురిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ముత్తారపుకట్టకు చెందిన బానోత్ రాము, అతని సోదరుడు రత్నకుమార్, వదిన అరుణ మధ్య సోమవారం భూమి విషయంలో ఘర్షణ జరిగింది.
దీంతో అన్న, వదిన దాడి చేయగా రాము తలకు గాయమైంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి వచ్చాక మంగళవారం రాము చేసిన ఫిర్యాదు మేరకు రత్నకుమార్, అరుణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినోద్ తెలిపారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

కామేపల్లి: తల్లి మందలించడంతో ఓ యువకుడు ఊరి వేసుకోగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని గోవింద్రాల గ్రామానికి చెందిన భూక్యా మధు(17) ఇటీవల ఐటీఐ పూర్తి చేయగా, ఏ పని చేయకుండా ఇంట్లో ఉంటుండడంతో తల్లి బుజ్జి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. కాసేపటికి గమనించిన స్థానికులు కొన ఊపిరితో ఉన్న మధును ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..
ఖమ్మంక్రైం: భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం వన్‌టౌన్ ఎస్ఐ సాయికుమార్ కథనం ప్రకారం.. ముస్తఫానగర్‌కు చెందిన యల్లబోయిన ఉపేందర్(33) భార్య నీలిమతో గొడవపడగా ఆమె సోమవారం రాత్రి సమీపంలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో ఉపేందర్ పురుగుల మందు తాగినట్లు తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం నీలిమ ఇంటికి రాగా, ఉపేందర్ అపస్మారక స్థితిలో ఉండడంతో ఇరుగుపొరుగును పిలిచి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తేలింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత..
ఖమ్మంక్రైం: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం టూటౌన్ ఎస్ఐ రఫీ తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్‌కు చెందిన గుమ్మడెల్లి కోటేశ్వరరావు కుమార్తె గిరిజ (22)కు సమీప బంధువైన శరత్‌చంద్రతో వివాహం జరిగింది. వీరికి ఏడాది వయస్సు కుమారుడు ఉండగా, కొంతకాలంగా ఆమెను భర్త, ఆడపడుచులు వేధిస్తున్నారు. దీంతో ఆమె మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. ఆమె తండ్రి కోటేశ్వరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో వ్యక్తి మృతి


కుంజా శివ (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని పార్థసారధీపురంలో ఓ వ్యక్తి పాము కాటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన కుంజా శివ(30) సోమవారం రాత్రి పొలంలో విద్యుత్ మోటారు ఆన్ చేసి వస్తుండగా పాము కాటేసింది. పాము ఆయనను రెండు సార్లు కాటేయడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. చాలాసేపటి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి పరిశీలించగా అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను గుర్తించి పెనుబల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శివకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, సీపీఎం నాయకులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, చిమట విశ్వనాథం, తడికమళ్ల చిరంజీవి తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి సీపీఎం నాయకుడైన శివ తండ్రి రాములు, కుటుంబీకులను పరామర్శించారు.

లారీ ఢీకొని ఒకరు..

సత్తుపల్లిరూరల్: వరి గడ్డి తీసుకొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీకి వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. వేంసూరు మండలం దుద్దేపూడికి చెందిన జుంజునూరి పెద్దమాధవరావు(48) సత్తుపల్లి మండలం తాళ్లమడ వద్ద మంగళవారం గడ్డి కొనుగోలుకు వెళ్లిన ట్రాక్టర్‌తో బయలుదేరాడు. అక్కడ గడ్డి లోడ్ చేసుకుని వస్తుండగా అశ్వారావుపేట వైపు వెళ్తున్న కంటైనర్ లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో మాధవరావుకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎంపీగా నామాను గెలిపించండి

- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపు
- ‘కోటెమ్మ’ సన్నిధిలో బీఆర్‌ఎస్ ప్రచారం ప్రారంభం


మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎంపీ నామా, ఎమ్మెల్సీ మధు, రేగా తదితరులు

ములకలపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీలో గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. ములకలపల్లి మండలం సర్సాపురం శివారు కోటెమ్మ ఆలయంలో మంగళవారం పూజలు చేయగా.. ఆ తర్వాత ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వద్దిరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీటితో పాటు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.4 వేల పెన్షన్, రూ.2లక్షల రుణమాఫీ చేయకపోవడంతో ఆ పార్టీ అబద్ధపు హామీలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో నామా 1.80 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచారని, ఈసారి రెండు లక్షల ఆధిక్యతతో గెలిపించి కేసీఆర్‌కు బహుమతి ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో రెండు సార్లు ఎంపీగా పనిచేసిన తనను మరోమారు గెలిపిస్తే మరింత సేవ చేస్తానని తెలిపారు. కాగా, ఈ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు సంబంధించిన ముఖ్య కార్యకర్తలకు ఈ సమావేశ సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు మోరంపూడి అప్పారావు, మట్ల నాగమణి, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సున్నం నాగమణి, భారత లావణ్య, కొడకండ్ల వెంకటరెడ్డి, ఒగ్గెల పూజ, భూక్యాప్రసాద్, ప్రకాశ్, శనగపాటి మెహరమణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



హాజరైన సిబ్బంది (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఆర్డీఓ మధు

కొత్తగూడెం ఆర్డీఓ మధు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా సిబ్బంది కృషి చేయాలని కొత్తగూడెం ఆర్డీఓ మధు అన్నారు. స్థానిక సింగరేణి మహిళా కళాశాలలో కొత్తగూడెం నియోజకవర్గ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు ఎంపికైన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్ సిబ్బంది సమష్టిగా పనిచేశారని, ఇదే స్ఫూర్తిని లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్లకు ఇంకా దరఖాస్తు చేసుకోని వారుంటే వెంటనే ఆ పని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షణా కేంద్రం ఇన్‌చార్జ్ అర్జున్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే చంద్రాయపాలెం ఘటన


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: మండలంలోని చంద్రాయపాలెంలో భూసమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యంతోనే పోలీసులపై దాడి జరిగిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అనుకోకుండా జరిగిన ఈ ఘటనను సాకుగా తీసుకుని పోలీసులు దౌర్జన్యం చేస్తూ ఆదివాసీలను చిత్రహింసలకు గురిచేయడం సరికాదన్నారు. సత్తుపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి సీఐ ఓ గిరిజన యువకుడి వద్ద సెల్‌ఫోన్ లాక్కుని అరెస్ట్ చేసేందుకు యత్నిస్తుండగా, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించరనే అనుమానంతో దాడికి ప్రయత్నించినట్లు గిరిజనులు చెప్పారన్నారు. బుగ్గపాడు, రుద్రాక్షపల్లి, బాసారంల్లో పేద గిరిజనులు సాగు చేసుకుంటున్న వేలాది ఎకరాల రెవెన్యూ భూములకు పట్టాలు ఇవ్వకుండా అటవీ భూమిలో కలుపుకోవడంతోనే ఇలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న 16లక్షల ఎకరాలకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాల్సి ఉన్నా నాలుగున్నర లక్షల ఎకరాలకే కేసీఆర్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందని వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు గంటా శ్రీనివాసరావు, అమర్లపూడి శరత్, కోర్స వెంకటేష్, నడికుదురు భాస్కర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టంగుటూరి నర్సింహారెడ్డి, బందెల వెంకటరాజం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) హరికిషన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తొలుత ప్రశాంతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ భూక్యా ప్రసాద్‌ను వారు పరామర్శించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించడమే కాక ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి కారకుడైన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద వెంకటేశ్వర్లు, పిట్టల మలయ్య, గుగులోత్ రాందాస్, బాణోత్ మంగీలాల్, కాలేపోగు లింగయ్య, ఎం.రాజగోపాల్, రాజు, మోహన్, కోటేశ్వరరావు, నాగేష్ , సైదులు, దామోదర్, లాలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: గత నెల 28న ఖమ్మం నర్తకి థియేటర్ సమీపాన రైలు కింద పడిన గుర్తుతెలియని వ్యక్తి (40) జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98481 14202 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

త్వరలో రాష్ట్రానికి జస్టిస్ చంద్రఘోష్ కమిషన్

- కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణ
- కోల్‌కతాలో జస్టిస్ చంద్రఘోష్‌తో నీటిపారుదల శాఖ కార్యదర్శి భేటీ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రారంభించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ త్వరలో హైదరాబాద్‌కు రానున్నారు. నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) బి.నాగేందర్‌రావు, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ మంగళవారం కోల్‌కతాలో జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో సమావేశమై విచారణ ప్రారంభించే అంశంపై చర్చించారు. బ్యారేజీలపై న్యాయ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతోపాటు విధివిధానాలను ఆయనకు సమర్పించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని, విచారణ ప్రారంభించడానికి షెడ్యూల్ అందజేయాలని కోరారు. ఈ నెల రెండో వారంలో జస్టిస్ చంద్రఘోష్ హైదరాబాద్‌కు వచ్చి విచారణ ప్రారంభించేందుకు అవకాశముంది.

8న 'కాళేశ్వరం'పై విచారణ

ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని సీబీఐకి అప్పగించాలని పిటిషన్లు

- నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, ఒక రిట్ పిటిషన్‌ను కలిపి వింటామన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం.. మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లలో వాదనలను సోమవారం(ఈనెల 8న) వింటామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్లలో ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు పిటిషన్ల తరఫు న్యాయవాదులకు చెబుతూ.. విచారణను వాయిదా వేసింది. మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు కారకులెవరో తేల్చేందుకు.. పూర్తి అంశంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది.

'జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలి. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.86 వేల కోట్ల సేకరణ వ్యవహారంపై కూడా సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)తో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలి. మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తేనే కుంగుబాటుకు అసలు కారణాలు బట్టబయలవుతాయి. నవంబర్ 1న నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్ల భద్రతకు వీలుగా చర్యలు చేపట్టేలా నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వాలి' అని కోరుతూ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, కాంగ్రెస్ నేత బక్క జడ్సన్‌తో పాటు మరో ఇద్దరు పిటిషన్లు(4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, ఒక రిట్ పిటిషన్) దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

ప్రభుత్వ నిర్ణయం తెలుసుకుని చెప్పండి

సీబీఐకి అప్పగించే విషయం, పిటిషనర్ల వాదనపై ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకొని చెప్పాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) ఇమ్రాన్ ఖాన్ ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయాన్ని ఏఏజీ.. ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పార్టీ ఇన్ పర్సన్ (అతనే వాదనలు వినిపిస్తారు)గా కేఏ పాల్ వాదిస్తూ వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. అయితే ప్రభుత్వ వాదన కూడా వినాల్సి ఉన్నందున ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం పేర్కొంది. తమ వాదనలు వినాలని పాల్, ఇతర పిటిషనర్ల లాయర్లు కోరగా ధర్మాసనం నిరాకరించింది. వ్యాజ్యాలను ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్నామంటూ విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. గతేడాది ఎన్‌డీఎస్‌ఏ అధికారులు ప్రాజెక్టును సందర్శించి మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగిపోవడానికి కారణాలపై ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ నివేదికను గత నెల విచారణ సందర్భంగా ప్రభుత్వం.. ధర్మాసనం ముందు ఉంచింది.

షీట్ పైల్స్‌కు బదులు సెకెంట్ పైల్స్

- నీటిపారుదల శాఖ సూచనలే కారణం
- నిపుణుల కమిటీకి అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ వెల్లడి
- కటాఫ్, క్రాస్ కటాఫ్ నిర్మాణంలో సైతం ఉల్లంఘనలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ (పునాదుల) కింద రక్షణగా షీట్ పైల్స్‌ను ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) జారీ చేసిన డిజైన్లకు విరుద్ధంగా సెకెంట్ పైల్స్‌ను ఏర్పాటు చేయడానికి ఆ శాఖ జారీ చేసిన సూచనలే కారణమని ..నిర్మాణ సంస్థ 'అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్'తెలిపింది. 2017 ఫిబ్రవరి 4న నీటిపారుదల శాఖ రామగుండం డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెకెంట్ పైల్స్‌ను వాడాలని లేఖ రాశారని.. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీకి తెలిపింది. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనం కోసం ఈ కమిటీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

2019లోనే ప్రమాద ఘంటికలు

సీడీఓ ఇచ్చిన డిజైన్లను ఉల్లంఘించి బ్యారేజీ రెండో బ్లాక్‌కి సంబంధించిన ఎగువ కటాఫ్ వాల్స్‌ను నిర్మించినట్టు నిర్మాణ సంస్థ అంగీకరించింది. అయితే, సంబంధిత ఇంజనీర్ నుంచి ఇందుకు ఆమోదం తీసుకున్నట్టు తెలిపింది. క్రాస్ కటాఫ్ వాల్స్ నిర్మాణంలో సైతం డిజైన్లను ఉల్లంఘించినట్టు తెలిపింది. 2019 వరదల సందర్భంగా బ్యారేజీ పూర్తిగా నిండిఉండగా, గేట్లను తక్కువ ఎత్తులో పైకి ఎత్తి వరదను వదలడంతో దిగువన రక్షణగా ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోయాయని నిర్మాణ సంస్థ తెలిపింది. ఈఎన్‌సీ రామగుండం విజ్ఞప్తితో మళ్లీ వాటిని పునరుద్ధరించినప్పటికీ, ఆ తర్వాతి కాలంలో వచ్చిన వరదల్లో మళ్లీ కొట్టుకుపోయాయని, 2019 వరదల సమయంలోనే బ్యారేజీ ప్రమాద ఘంటికలు మోగించిందంటూ నిపుణుల కమిటీ అడిగిన ఓ ప్రశ్నకు నిర్మాణ సంస్థ బదులిచ్చింది. కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతంలో లోతైన గుంతలు పడి బ్యారేజీ పునాదుల కింద ఏర్పాటు చేసిన సెకెంట్ పైల్స్‌కి నష్టం కలిగించాయని తమ పరిశీలనలో తేలినట్టు వెల్లడించింది. బ్యారేజీ దిగువన తగిన స్థాయిలో నీటి నిల్వకు ఏర్పాట్లు లేకపోవడంతోనే ఇలా జరిగిందని వివరించింది. బ్యారేజీ దిగువన తగిన స్థాయిల్లో నీళ్లు నిల్వ ఉండేలా ప్రత్యామ్నాయ టెయిల్ పాండ్ వంటి నిర్మాణాన్ని చేపట్టాలని మోడల్ స్టడీస్ నిర్వహించిన నిపుణులు చెప్పినట్లు తెలిపింది.

బ్యారేజీలో నీళ్లు నిల్వ చేయరాదు

బ్యారేజీకి శాశ్వత రక్షణ చర్యలు తీసుకునే వరకు నీటిని నిల్వ చేయరాదని నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది వచ్చే వరదను ఎప్పటికప్పుడు వదిలేయాలని సూచించింది.

ముక్కలు చేసి.. మూసీలో పడేసి!

▶ మొదటి పేజీ తరువాయి

పొందుపరిచారు. మంగళవారం వీరిద్దరిని గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి శనివారం వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ప్రణీత్‌రావు దారికి వచ్చాడంటూ...

ఈ కేసులో తొలి అరెస్టు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుదే. తొలుత పోలీసు విచారణకు అతడు సహకరించలేదని, అయితే రానురాను సహకరిస్తూ కీలక వివరాలు వెల్లడించారని పోలీసులు కోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు రాజీనామా చేసిన రోజే (గత ఏడాది డిసెంబర్ 4న) ఆయన ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న టీఎస్ఎస్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కైతోజు కృష్ణతో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలు ఆఫ్ చేయించాడు. వార్‌రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితో పాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. తనతో వచ్చిన ఎలక్ట్రీషియన్‌తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ముక్కలు చేశాడు. వీటి శకలాలను



వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి నిందితులు తిరుపతన్న, భుజంగరావు

నాగోలు వద్ద మూసీనదిలో పారేశాడు. ఈ విషయాలు వెలుగులోకి రావడంతోనే అప్రమత్తమైన సిట్ అధికారులు మూసీలో సోదాలు చేశారు. వీరికి ధ్వంసమైన హార్డ్‌డిస్క్ కేసులు 5, హార్డ్‌డిస్క్ ముక్కలు తొమ్మిది లభించాయి. వీటితో పాటు తాము మూసీ నుంచే ఆరు మెటల్ హార్డ్‌డిస్క్ ముక్కల్నీ సీజ్ చేశామని కోర్టుకు తెలిపారు.

ఎస్ఐబీ కార్యాలయం నుంచి ఆధారాలు

ప్రణీత్‌రావు వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు మూసీనది నుంచే కాకుండా గ్రీన్‌లాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయం, దాని ఆవరణ, పరిసరాల నుంచి కొన్ని ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు సేకరించారు. అక్రమ ట్యాపింగ్‌కు వినియోగించిన 12 కంప్యూటర్లు, 7 సీపీయూలు, ల్యాప్‌టాప్, మానిటర్లు, పవర్ కేబుళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఎలక్ట్రీషియన్ గదిలో క్లూస్, ఫోరెన్సిక్ అధికారులతో కలిసి సోదాలు చేసిన సిట్.. హార్డ్‌డిస్క్‌లు కట్ చేస్తున్నప్పుడు కింద పడి, మూలలకు చేరిన వాటి పొడిని సీజ్ చేశారు. ఎస్ఐబీ కార్యాలయ ఆవరణలో పాక్షికంగా కాలిన డాక్యుమెంట్లు, స్పైరల్ బైండింగ్ చేసిన పత్రాలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీకి సంబంధించిన లాగ్‌బుక్ ప్రతులను పోలీసులు సేకరించారు. ఎస్ఐబీ కానిస్టేబుల్ కొత్త నరేష్‌గౌడ్ నుంచి వాంగ్మూలం నమోదు చేశారు.

ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌కు నోటీసులు?



అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌రావుకు సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఎస్ఓటీలో పని చేయడానికి తన నమ్మిన బంటుల్ని నియమించుకోవాలని ప్రభాకర్‌రావు భావించి నల్లగొండ నుంచి ప్రణీత్, రాచకొండ నుంచి భుజంగరావు, సైబరాబాద్ నుంచి వేణుగోపాల్‌రావు, హైదరాబాద్ నుంచి తిరుపతన్నలకు అవకాశం ఇచ్చారు. వీరు ఎస్ఐబీతో పాటు మరో మూడు ప్రాంతాల్లో సర్వర్లు ఏర్పాటు చేసి సాంకేతిక నిఘా కొనసాగించారని తెలిసింది. ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించడానికి వేణుగోపాలరావును విచారించాలని సిట్ నిర్ణయించుకుంది. దీంతో బుధవారం బంజారాహిల్స్ ఠాణాలో విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్ట్‌లో వేణుగోపాల్‌రావు పేరును సిట్ అధికారులు పొందుపరిచారు. వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన వేణుగోపాల్ 1989లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. చిగురుమామిడి, కరీంనగర్ రూరల్, జమ్మికుంట ఠాణాల్లో పని చేస్తుండగా అనేక వివాదాలకు కేంద్ర బిందువు అయ్యారు. 2013లో డీఎస్పీ పదోన్నతి పొంది పెద్దపల్లి, సైబరాబాద్ క్రైమ్స్, ఎల్బీనగర్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఎస్ఐబీలో అదనపు ఎస్పీ హోదాలో దాదాపు ఏడేళ్లు పని చేసి పదవీ విరమణ పొందారు. ఆపై ప్రభాకర్‌రావు సహకారంతో ఓఎస్డీగా కొనసాగారు.

అత్తింటి ఆరళ్లకు ముగ్గురు బలి

- ఏడాది బిడ్డను చంపి.. తల్లి ఆత్మహత్య
- కూతురు, మనవడి మృతితో అమ్మమ్మ బలవన్మరణం
- కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో విషాదం



శ్రీజ, రేయాన్ష్ మృతదేహాలు

కరీంనగర్ రూరల్: అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులను తట్టుకోలేక ఏడాది బిడ్డకు విష గుళికలు ఇచ్చి చంపిందా తల్లి. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని తట్టుకోలేక మృతురాలి తల్లి సైతం ఆత్మహత్యకు పాల్పడింది. ఒకేరోజు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతితో కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో తీరని విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మకల్ గ్రామ పంచాయతీ విజయ్‌నగర్‌కాలనీలో ఉంటున్న ఉపాధ్యాయ దంపతులు గద్దె వెంకటేశ్వరచారి- జయప్రద(55) తమ చిన్న కూతురు శ్రీజ(25)కు మూడేళ్లక్రితం వరంగల్ జిల్లా మొగ్గుంపూర్‌కు చెందిన నరేశ్‌తో కట్నకానుకలతో వివాహం జరిపించారు. ఏడాదిపాటు సక్రమంగా కాపురం చేసిన నరేశ్... కొడుకు ఆర్యన్(1) పుట్టాక శ్రీజను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. అత్తమామలు సుజాత-కేశవచారి హింసించడంతో శ్రీజ గత నెల 29న బొమ్మకల్‌లోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం ఉదయం 6గంటలకు కొడుకు మొదటి బర్త్‌డే గురించి నరేశ్‌కు శ్రీజ ఫోన్ చేయడంతో అత్తమామలు, భర్త కలిసి తీవ్రంగా దూషించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీజ క్రిమిసంహారక మాత్రలను కొడుకు ఆర్యన్‌కు తాగించి ఆ తర్వాత తానూ వేసుకుంది. అపస్మారకస్థితిలో పడి ఉన్న తల్లి, కొడుకులను జయప్రద, వెంకటేశ్వరచారి అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బిడ్డ మృతిచెందగా శ్రీజ చికిత్స పొందుతూ చనిపోయింది. కూతురు, మనవడి మృతిని తట్టుకోలేక జయప్రద ఇంటికివెళ్లి క్రిమిసంహారక మాత్రలు వేసుకుంది. ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

జిల్లా వార్తలు

ఆలయ నిర్మాణానికి రూ.1.01లక్షల విరాళం




విరాళం అందజేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌లోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ ఆలయ నిర్మాణానికి విద్యానగర్‌కాలనీ చెందిన కానూర్ల కృష్ణ కుమారుడు, కోడలు రాజరాజేశ్వర్ – తేజశ్రీ విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. ఈమేరకు దాతలకు ఆలయ కమిటీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'పున్నాగ పూలు' పుస్తకావిష్కరణ

- విద్యార్థులు రాసిన కథలతో సంకలనం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఖమ్మంగాంధీచౌక్: విద్యార్థులు రచించిన కథలతో రూపొందించిన 'పున్నాగ పూలు' కథల సంకలనాన్ని ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ మంగళవారం ఆవిష్కరించారు. బాల సాహిత్య వేదిక కన్వీనర్ కొండ్రు బ్రహ్మం సంపాదకత్వం వహించగా, ఖమ్మం ఎన్ఎస్‌పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కథలు రాశారు. ఈసందర్భంగా పాఠశాలలో పుస్తకాన్ని ఆవిష్కరించాక డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాల విద్యార్థులు 39 మంది కథలు రాయటం సంతోషాన్ని కలిగించిందని చెప్పారు. పుస్తకాన్ని బాలాహితవేత్త కన్నెగంటి వెంకటయ్య సమీక్షించగా... హెచ్ఎం శంకర్‌రావు, సంపాదకులు బ్రహ్మం, దాతలు పూనాటి వెంకటేశ్వర్లు, నారాయణరావుతో పాటు కొమ్మవరపు కృష్ణయ్య, గద్దపాటి శ్రీనివాస్, షఫీ, సుజాత, కొల్లు వెంకటేశ్వరరావు, పగిడపల్లి వెంకటేశ్వర్లు, నయీంపాషా, సంధ్యా తిరుపతమ్మ, శ్రీదేవి, శశికళ, కమల, ఉస్మాన్ అలీ, శ్రీరామ్మూర్తి, జయపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విత్తన భారం తగ్గినట్లే..

- రాయితీ పునరుద్ధరణకు ప్రభుత్వం కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 60 వేల క్వింటాళ్ల సరఫరాకు ప్రణాళిక
- వచ్చే ఖరీఫ్ నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం



తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ సరఫరా చేసే వరి విత్తనాల బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: రైతులపై విత్తన భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పూర్వం మాదిరి రానున్న వానాకాలం నుంచి రాయితీపై విత్తనాలను రైతులకు సరఫరా చేసే అంశంపై వ్యవసాయ శాఖ ప్రతిపాదనలను ఇప్పటికే సమర్పించింది. ఏళ్ల క్రితం నుంచి రైతులకు విత్తన రాయితీ అమలులో ఉన్నా పచ్చిరొట్ట విత్తనాలకు మినహా ఇతర విత్తనాలపై రాయితీని 2020 నుంచి గత ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో రైతులు ప్రైవేట్ విత్తన సంస్థలు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన రైతులకు విత్తన భారం నుంచి వెసలుబాటు కల్పించేలా పూర్వ విధానాన్ని అమలు చేయడమే కాక మరికొన్ని ప్రయోజనాలను అమలు వర్తింపచేసేందుకు తాజాగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

గతంలో ఇలా...

రైతులకు ప్రోత్సాహకరంగా ఉండేలా చూస్తూ కాస్త భారం తగ్గించేలా వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. గతంలో విత్తనాల ఆధారంగా 50 నుంచి 65 శాతం వరకు రాయితీపై అందించేవారు. వరికి మాత్రం కిలో ఒక్కంటికి రూ.5 నుంచి రూ.10 వరకు సబ్సిడీ లభించేది. ప్రస్తుతం 35 నుంచి 65 శాతం వరకు సబ్సిడీతో విత్తనాలను అందించేందుకు అధికారుల ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో ఖమ్మం ఉండగా.. ఇక్కడి నుంచే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల రైతులకు విత్తనాలను సరఫరా చేస్తారు.

అత్యధికం వరి సాగు...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నీటి వనరుల ఆధారంగా రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. అయితే, నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఖమ్మం జిల్లాకు ప్రధాన నీటివనరుగా ఉండటంతో ఇక్కడ వరి అత్యధికంగా సాగవుతోంది. భద్రాద్రి జిల్లాలో కూడా ప్రాజెక్టులు, ఇతర నీటి వనరుల ఆధారంగా అన్ని పంటలు సాగు చేస్తున్నారు. ఇక ఉమ్మడి జిల్లా అంతటా వరితో పాటు మొక్కజొన్న, పెసర,



పెసర విత్తనాల బ్యాగ్‌లు

మినుము, కంది, వేరుశనగ, పత్తి, మిర్చి వంటి పంటలను సాగవుతాయి. ఇందులో పత్తి, మిర్చి పంటలు మినహా మిగిలిన పంటల విత్తనాలను రాయితీ లభించే అవకాశముంది.

రాయితీపై 60వేల క్వింటాళ్ల విత్తనాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2019-20 సంవత్సరం 52వేల క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై రైతులకు అందించారు. ప్రస్తుతం ఆ లక్ష్యం 60 వేల క్వింటాళ్లకు చేరే అవకాశముంది. ఇందులోవరి 25 వేల క్వింటాళ్లు, పచ్చిరొట్ట విత్తనాలు 25 వేల క్వింటాళ్లు, పెసర, మినుము, కంది 7వేల క్వింటాళ్లు, వేరుశనగ, మొక్కజొన్న, ఇతర రకాలు 3వేల క్వింటాళ్ల వరకు ఉండే అవకాశముందని సమాచారం. కాగా, 2019-20 వరకు రెండు జిల్లాల వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా 52వేల క్వింటాళ్ల విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతులకు అందుబాటులో ఉంచేది. ప్రస్తుతం పెరిగిన సాగు విస్తీర్ణం, నీటి వనరుల ఆధారంగా 60 వేల క్వింటాళ్ల వరకు అధికారులు ప్రతిపాదనలు సమర్పించనుండగా.. గతంలో మాదిరిగానే తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు పంపిణీ చేయనుంది.

తగ్గనున్న విత్తనాల ధర

- గడిచిన సీజన్‌లో వరిలో బీపీటీ-204 విత్తనాలు(25 కిలోలు) రూ.887-50లుగా, ఎంటీయూ-1010 రకం రూ.882లుగా, పీకేవీ హెచ్ఎంటీ రకం రూ.912-50లుగా, కేఎన్ఎం-1638 రకం రూ.1,059గా, ఆర్ఎన్ఆర్ 15048 రకాన్ని రూ.882-50 ధరతో విక్రయించారు.
- ఆయా విత్తనాలకు గతంతో మాదిరి ప్రభుత్వం కిలో ఒక్కంటికి రూ.5 నుంచి రూ.10 వరకు రాయితీ అమలుచేస్తే 25 కిలోల విత్తన బ్యాగ్ ధర రూ.125 నుంచి రూ.250 వరకు తగ్గే అవకాశం ఉంది.
- ఇక పెసర, కంది విత్తనాలపై 50 శాతం రాయితీ ఇచ్చారు. ప్రస్తుతం పెసర(ఎంజీజీ-295) నాలుగు కిలోల బ్యాగ్ ధర రూ.432-40 ఉండగా.. కందులు రూ.452, మినుములు రూ.424 ధర ఉంది.
- వీటిపై రాయితీ వర్తింపచేస్తే ప్రస్తుత ధరల్లో సగానికే రైతులకు లభించే అవకాశముంది.
- అంతేకాక వేరుశనగ, మొక్కజొన్న విత్తనాలను కూడా 50 శాతం వరకు సబ్సిడీపై అందించారు.
- వేరుశనగ 30 కిలోల సంచి ప్రస్తుత ధర రూ.2,865గా ఉండగా, మొక్కజొన్న 5 కిలోల సంచి రూ.600 పలుకుతుంది.
- ఇక పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు, పిల్లి పెసర, జనుములు విత్తనాలకు 65 శాతం సబ్సిడీ కొనసాగుతుంది.

పండితాపురం సంత బాధ్యతలు జీపీకి..

కామేపల్లి: పశువుల అమ్మకాల్లో రాష్ట్రవ్యాప్తంగా పేరున్న కామేపల్లి మండలం కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీ కృష్ణప్రసాద్ వారాంత పు సంత నిర్వహణను గ్రామపంచాయతీకే అప్పగిస్తూ కలెక్టర్ గౌతమ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల సంత నిర్వహణను అప్పగించేందుకు బహిరంగ వేలం నిర్వహించగా పలుమార్లు వాయిదా పడింది. ఇంతలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా.. మార్చితో సంత కౌలు గడువు ముగిసింది. ఈ నేపథ్యాన ఎన్నికల కోడ్ ముగిసి వేలం నిర్వహించే వరకు సంత నిర్వహణను కొమ్మినేపల్లి జీపీకి అప్పగించగా, బుధవారం జరిగే సంతను జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, కార్యదర్శి నెహ్రూ పర్యవేక్షిస్తారు. కాగా, సంత పర్యవేక్షణకు సుమారు 50మంది నుంచి 60 మంది సిబ్బంది కావాల్సి ఉండడంతో గ్రామపంచాయతీ ఉద్యోగులతో సాధ్యమవుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. పర్యవేక్షణ లోపం కారణంగా ఆదాయం పడిపోయే అవకాశముందని చెబుతున్నారు.

కేసీఆర్ అసమర్థతతోనే ప్రకృతి వైపరీత్యాలు




ఇల్లెందులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి బలరాం, తదితరులు

- 92 శాతం రైతుబంధు పూర్తి చేశాం
- పంటల బీమా పునరుద్ధరణకు యత్నం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఇల్లెందులో మహబూబాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం

ఇల్లెందు: మాజీ సీఎం కేసీఆర్ అసమర్థ విధానాల వల్లే రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జనసమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తారని తెలిపారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల కోసం నియోజకవర్గ, మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో సాధించిన మెజార్టీని మించి వచ్చే ఎన్నికల్లో అధిగమించాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సోనియాగాంధీ ఆరు గ్యారంటీలు ప్రకటించారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అధ్వానంగా ఉన్నా వాటిని అమలు చేసి తీరుతామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పని చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వ్యవస్థను సక్రమ పద్ధతిలో పెడుతున్నామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. అవినీతి, అవకతవకలు, వ్యవస్థలు చెడిపోవడానికి కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణమని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ 100 రోజుల పాలనపైనే పార్లమెంట్ ఎన్నికల తీర్పు వెలువడుతుందని అన్నారు. పదేళ్లు పాలించిన సీఎం కేసీఆర్ వందల, వేల అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆయన హోదాకు అది తగదని హితవు పలికారు. రాష్ట్రంలో 92.36 శాతం రైతుబంధు పంపిణీ పూర్తి చేశామని, పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని, ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా 40 రోజుల సమయం ఉందని, గ్రామ, బూత్ స్థాయిలో విస్తృత ప్రచారం చేసి మహబూబాబాద్ స్థానం నుంచి పోరిక బలరామ్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, ఇల్లెందు, పినపాక, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, రామచంద్రు నాయక్, మురళీనాయక్, దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే(బీఆర్ఎస్) తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు.. తప్పిపోయిన వ్యక్తి

అప్పగించిన అన్నం సేవా ట్రస్ట్ బాధ్యులు



పన్నా రిషిని కుటుంబీకులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి దారి తప్పి తిరుగుతున్న వ్యక్తిని చేరదీసిన ఖమ్మంలోని అన్నం సేవా ట్రస్ట్ బాధ్యులు ఆయన ఆరోగ్యం కుదుటపడ్డాక కుటుంబం ఆచూకీ కనుగొని అప్పగించారు. దీంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం శ్రీనగర్ కాలనీలో 30ఏళ్ల వ్యక్తి ఏడాది క్రితం అర్ధరాత్రి వేళ తిరుగుతూ స్థానికులను ఇబ్బంది పెడుతుండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారి సూచనల మేరకు అన్నం సేవా ట్రస్ట్ బాధ్యులు ఆయనను చేరదీశారు. అప్పటినుంచి ఆశ్రయంలో ఆయనకు వైద్యం చేయించగా ఇటీవలే కోలుకున్నాడు. దీంతో సదరు వ్యక్తిని వివరాలు ఆరా తీయగా తన పేరు పన్నా రిషి అని, తమది బీహార్ రాష్ట్రం కతిహార్ జిల్లా కొరహా గ్రామమని చెప్పగా ఆన్‌లైన్‌లో వివరాలు తీసి అక్కడి పోలీసుల ద్వారా ఆయన కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఆపై వీడియో కాల్‌లో మాట్లాడించగా కుటుంబ సభ్యులు పన్నా రిషిని గుర్తించి మంగళవారం ఖమ్మం వచ్చారు. ఆయన భార్య, బావమరిది ఇక్కడకు రాగా ఖమ్మం అర్బన్ సీఐ సమక్షాన పన్నారిషిని అప్పగించారు. అలాగే, కుటుంబ పోషణ నిమిత్తం రూ.25వేలు అందచేయడంతో వారు అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.